# కోవ లక్ష్మిని మెజార్టీతో గెలిపించాలి

- టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు
- గోలేటి టౌన్‌షిప్ కార్మిక కాలనీలో ప్రచారం

రెబ్బెన, అక్టోబర్ 31 : ఆసిఫాబాద్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, జడ్పీ చైర్ పర్సన్ కోవ లక్ష్మిని భారీ మెజార్టీతో గెలిపించాలని బెల్లంపల్లి ఏరియా టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు కోరారు. మండలంలోని గోలేటిటౌన్‌షిప్ కార్మిక కాలనీలో మంగళవారం టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ పార్టీ మ్యానిఫెస్టోలోని అంశాల గురించి ప్రతి ఒక్కరికీ వివరించారు. కారుగుర్తుకు ఓటు వేస్తే కోవ లక్ష్మి గెలవడంతో పాటు, కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి అవుతారని పేర్కొన్నారు. సింగరేణిలో సీఎం కేసీఆర్ కోల్ ఇండియా స్థాయిలో లేని హక్కులను కల్పించారన్నారు. ఇప్పుడు కేసీఆర్ రుణం తీర్చుకునే సమయం వచ్చిందని, ఆయన ప్రకటించిన ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ జీఎం కమిటీ మెంబర్ మారిన వెంకటేశ్వర్లు, నాయకులు కైత స్వామి, ఓరం కిరణ్, బాబురావు, రమేశ్, మోరే సత్యనారాయణ, రాసపాక రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



గోలేటిటౌన్‌షిప్ కార్మిక కాలనీలో ప్రచారం చేస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

# సింగరేణిలో అన్ని హక్కులు అమలు



ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం కమిటీని నియమిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు అంథోటి నాగేశ్వర్‌రావు

- ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు అనేక ప్రయోజనాలు
- తెలంగాణ ప్రభుత్వ ఎస్సీ కమిషన్ సభ్యుడు లక్ష్మీనారాయణ
- సంక్షేమ సంఘం జనరల్ బాడీ సమావేశం

శ్రీరాంపూర్, అక్టోబర్ 31 : సింగరేణిలో ఎస్సీ, ఎస్టీ కార్మికులు, ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వపరంగా అన్ని విధాలా హక్కులు అమలవుతున్నాయని తెలంగాణ ప్రభుత్వ ఎస్సీ కమిషన్ సభ్యుడు కొంకటి లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏరియా లైజన్ ఆఫీసర్ కే కిరణ్ కుమార్ అధ్యక్షతన మంగళవారం సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ కమిషన్ సభ్యుడు, రాష్ట్ర అధ్యక్షుడు అంథోటి నాగేశ్వర్‌రావు మాట్లాడారు. సింగరేణిలో తెలంగాణ ప్రభుత్వం దళిత, గిరిజన ఉద్యోగులకు ఆర్‌ఓఆర్ అమలు చేస్తున్నదన్నారు. అంబేద్కర్ జయంతి రోజున వేతనంతో కూడిన సెలవుగా ఇస్తున్నట్లు గుర్తుచేశారు. ప్రభుత్వం, సింగరేణి దళిత, గిరిజన ఉద్యోగులకు అమలు చేస్తున్న వివిధ సౌకర్యాలు, హక్కులు, సంక్షేమ పథకాలతో సర్వీస్ మొత్తంగా ఒక్కో కార్మికుడిడికి కనీసం రూ.20 లక్షల ఆర్థిక ప్రయోజనాలు కలుగుతున్నాయని చెప్పారు. సింగరేణిలో బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో రిటైర్డ్ జీఎం అందె ఆనంద్‌రావు, సీఎంవోఏ కిరణ్‌రాజ్, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఆరెల్లి రాజేందర్, సభ్యుడు కాశెట్టి కృష్ణ, డాక్టర్ రాజేశ్వర్, చీఫ్ అడ్వైజర్ ఈర్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

### నూతన కమిటీ ఎన్నిక..

శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఏరియా ఉపాధ్యక్షుడిగా డేగల ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా రెడపాక లక్ష్మణ్, కోశాధికారిగా గోదారి మురళి, సలహాదారుగా గునిగంటి నర్సింగారావు, సంయుక్త కార్యదర్శులుగా శెట్టి శంకరయ్య, అందె వెంకటేశ్, మేడ పెద్దయ్య, ఏ శంకర్, చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కే శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా దేవి శ్రీనాథ్, వీ రవిబాబు ఎన్నికయ్యారు.

# జాతీయ ఐక్యతా దినోత్సవం

కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 31 : సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని సింగరేణి ప్రధాన కార్యాలయంలో మంగళవారం జాతీయ ఐక్యతా దినోత్సవం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ రంగ సంస్థల్లో జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని నిర్వహించారు. సింగరేణి డైరెక్టర్లు డీ సత్యనారాయణరావు, ఎన్‌వీకే శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. అధికారులు, ఉద్యోగులతో ఐక్య ప్రతిజ్ఞ చేయించారు. భారతదేశ తొలి హోంమంత్రి, ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి (2014 నుంచి యేటా అక్టోబర్ 31న) సందర్భంగా జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీవో టీ శ్రీనివాసరావు, జీఎంలు జక్కం రమేశ్, బసవయ్య పాల్గొన్నారు.



కొత్తగూడెం సింగరేణి : ఐక్యత ప్రతిజ్ఞ చేస్తున్న డైరెక్టర్లు, అధికారులు

### శ్రీరాంపూర్ సీహెచ్‌పీపై..

శ్రీరాంపూర్, అక్టోబర్ 31 : శ్రీరాంపూర్ సీహెచ్‌పీపై జాతీయ సమైఖ్యతా దినోత్సవం నిర్వహించారు. డీవైజీఎం వెంకటేశ్వర్‌రావు ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడుతూ.. దేశ ఐఖ్యతను ప్రతి ఒక్కరూ చాటాలని కోరారు. ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జన్మదినాన్ని పురస్కరించుకొని దేశ సమైక్యతను కాపాడుకోవాలని ప్రజలందరికీ గుర్తు చేస్తూ సమైక్యతా దినోత్సవాన్ని జరుపుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌పీ ఈఈ దామోదర్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీరాంపూర్ : సీహెచ్‌పీపై కార్మికులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

# 2న జనరల్ బాడీ సమావేశం

- కార్మికులు, నాయకులు తరలిరావాలి
- విజయవంతం చేయాలి
- మణుగూరు ఏరియా బ్రాంచ్ ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌రావు

మణుగూరుటౌన్, అక్టోబర్ 31 : మణుగూరు ఏరియా పీవీకాలనీ కమ్యూనిటీహాల్‌లో నవంబర్ 2న నిర్వహించే టీబీజీకేఎస్ జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఏరియా బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వూకంటి ప్రభాకర్‌రావు కార్మికులను కోరారు. ఏరియాలోని అన్ని గనులు, డిపార్టుమెంట్లలో మంగళవారం కార్మికులను కలిశారు. జనరల్ బాడీ సమావేశానికి హాజరుకావాలని ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులను, టీబీజీకేఎస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకునేందుకు టీబీజీకేఎస్ అధ్యక్షుడు వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య దిశానిర్ధేశం చేయనున్నారని వెల్లడించారు. జనరల్ బాడీ సమావేశానికి ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు, మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత హాజరవుతారని వివరించారు. టీబీజీకేస్, బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు సమావేశానికి పెద్ద సంఖ్యలో హాజరై, విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అబ్దుల్ రవూఫ్, వీర భద్రయ్య, కాపా శివాజీ, ఎస్‌వీఎస్‌ఎన్ వర్మ, సీహెచ్‌వీ రెడ్డి, బానోత్ కృష్ణ, అశోక్, అన్ని గనులు, డిపార్టుమెంట్ల పిట్ సెక్రటరీలు, పిట్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కార్మికులతో మాట్లాడుతున్న టీబీజీకేఎస్ నాయకుడు ప్రభాకర్‌రావు

# ఎస్‌అండ్‌పీసీపై మంచి అభిప్రాయం

- సెక్యూరిటీ జీఎం బీఆర్ దీక్షితులు
- సెక్యూరిటీ జమేదార్ల పునశ్చరణ శిక్షణ తరగతులు ప్రారంభం

కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 31 : సింగరేణి యాజమాన్యం దృష్టిలో ఎస్‌అండ్‌పీసీ విభాగం పనితీరుపై మంచి అభిప్రాయం ఉన్నదని సెక్యూరిటీ జీఎం బీఆర్ దీక్షితులు అన్నారు. ఎస్‌అండ్‌పీసీ కార్పొరేట్ ట్రైనింగ్ సెంటర్‌లో 11వ బ్యాచ్ సెక్యూరిటీ జమేదార్ల పునశ్చరణ శిక్షణ తరగతులను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా దీక్షితులు మాట్లాడారు. ప్రతీ యూనిఫాం సిబ్బందికి శిక్షణ అనేది ముఖ్యమన్నారు. శిక్షణ కార్యక్రమాల ద్వారా మానసిక, శారీరక దారుఢ్యం, వృత్తి నైపుణ్యం మెరుగుపడుతుతాయని పేర్కొన్నారు. సెక్యూరిటీ సిబ్బందికి బేసిక్ ట్రైనింగ్, రిఫ్రెషర్ ట్రైనింగ్, ఫస్ట్ ఎయిడ్, ఫైర్ ఫైటింగ్, ఆన్ ఆర్మ్‌డ్ కంబాట్ ట్రైనింగ్, ట్రాఫిక్ కంట్రోల్, ఇంటెలిజెన్స్ విభాగాల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా రిఫ్రెషర్ ట్రైనింగ్‌లో పీటీ డ్రిల్, సెక్యూరిటీ ఆపరేషన్స్ ఈ మూడు విభాగాల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్‌వో జాకీర్ హుస్సేన్, ట్రైనింగ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, కార్పొరేట్ జూనియర్ ఇన్‌స్పెక్టర్ ఎన్‌వీ రమణ, జమేదార్లు, అన్ని ఏరియాల సెక్యూరిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న సెక్యూరిటీ జీఎం బీఆర్ దీక్షితులు

# సమస్యల పరిష్కారానికి కృషి

రెబ్బెన, అక్టోబర్ 31 : బెల్లంపల్లి ఏరియాలోని కైర్‌గూడ ఓసీపీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు అన్నారు. ఏరియాలోని కైర్‌గూడ ఓసీపీలో మంగళవారం ఆయన పర్యటించారు. కార్మికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీపావళి బోనస్ వారంలోగా ఇప్పించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయన్నారు. త్వరలోనే కార్మికులకు ప్రమోషన్లు కూడా ఇప్పిస్తామని తెలిపారు. కైర్‌గూడ పిట్ కార్యదర్శి కార్నాథం వెంకటేశ్, జీఎం కమిటీ సభ్యులు మారిన వెంకటేశ్, చంద్రశేఖర్, అసిస్టెంట్ పిట్ కార్యదర్శి భాస్కరచారి, నాయకులు కైత స్వామి, ఓరం కిరణ్, రామ్మోహన్, శ్యాంసుందర్, మేకార్తి మల్లేశ్, రాజమౌళి, రాజేశం, మోరే సత్యనారాయణ పాల్గొన్నారు.

### స్పందించిన యాజమాన్యం..

గోలేటిటౌన్‌షిప్‌లోని డంప్‌యార్డులో వెలువడుతున్న పొగను సింగరేణి యాజమ్యాం నియంత్రించిందని శ్రీనివాసరావు తెలిపారు. డంప్‌యార్డులో మంటలు వ్యాపించి, విషవాయువులతో కూడిన పొగ వస్తున్నదని, నివారించాలని టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో జీఎం రవిప్రసాద్‌కు వివరించామని పేర్కొన్నారు. ఈ మేరకు వారు స్పందించి సమస్యను పరిష్కరించారని వెల్లడించారు.